క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



నెల్లూరు(అర్బన్): కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలకు చెందిన మసనం అజయ్‌బాబు జవహర్ నవోదయ–2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబర్చి సీటు సాధించాడు. ఈ సందర్భంగా అజయ్‌బాబుకు హెచ్‌ఎం భాస్కర్‌రావు ఉపాధ్యాయులతో కలిసి పూలమొక్క అందజేసి అభినందించాడు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రాశి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ముద్రించిన క్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ స్వయంపాకులు శ్రీనివాసులు బుధవారం ఆవిష్కరించారు. క్యాలెండర్‌కు తోడ్పాటును అందించిన దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వయోలిన్ వాయిద్యకారుడు పాలేటి గోవర్ధనశర్మ వాద్య కచేరి చేశారు. అనంతరం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ క్రోధి నామ సంవత్సర క్యాలెండర్లతో పాటు ఉగాది పంచాగాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వేంకటలక్ష్మీ నరసింహరావు, ట్రస్ట్ ,ధ్యాన మందిరం నిర్వాహకులు పారా వేంకట శ్రీధర్‌శర్మ, మైపాడు రాజా, ఏ సత్యనారాయణ, పీ లీలామోహన్, టీ శ్రీకాంత్‌శర్మ, ఎం.లక్ష్మీనరసింహారావు, ఆర్ మణిశంకర్‌శర్మ, ముద్వా ప్రసాద్‌శర్మ, టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 7వ తేదీన ఉదయం 8 గంటలకు ఆది శంకర ధ్యానమందిరంలో మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్ణవారాభిషేకాలు, శంకరాచార్యులకు అర్చన, పూజా కార్యక్రమాలు జరుగుతాయని నరసింహారావు తెలిపారు.

ఆదాలపై పాట ఆవిష్కరణ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై నల్గొండ జూనియర్ గద్దర్ పాడిన పాట బుధవారం విడుదల చేశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఆడియో ఆవిష్కరణ జరిగింది. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైవీరెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పాశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకుడు బాగి వెంకటరమణ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ గిరిజన కాలనీలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచార కరపత్రాలను అందజేశారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు దేవరకొండ ప్రభాకర్, రమేష్, వెంకటరవి, దాసరి రమణయ్య, రాజా, సన్నీ, నరేష్ పాల్గొన్నారు.

రత్నం మరణం తీరని లోటు



నెల్లూరు(బారకాసు): కేవీ రత్నం మరణం విద్యారంగానికి తీరనిలోటు అని మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పేర్కొన్నారు. రత్నం విద్యా సంస్థల అధినేత కేవీ రత్నం ఉత్తర క్రియలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దంపతులు పాల్గొని రత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రత్నం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేవీ రత్నం ఎందరో విద్యార్థులను వైద్యులు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దారన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించిన ఘనత రత్నందేనని కొనియాడారు.

సంక్షేమాభివృద్ధే విజయానికి దోహదం



12వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు సిటీ: ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీని విజయానికి దోహదపడుతాయని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 34వ డివిజన్, ప్రగతినగర్‌లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా, విజయసాయిరెడ్డిని నెల్లూరు ఎంపీగా గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 34వ డివిజన్ కార్పొరేటర్ షామీదా, నాయకులు లక్ష్మీసునంద, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, వంశీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

•నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లోని ఇస్కాన్‌సిటీ, దొరతోట, హరేకృష్ణనగర్, తదితర ప్రాంతాల్లో డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు పోతురాజు రమాదేవి, రాజారెడ్డి, సీహెచ్ గోపాల్‌రెడ్డి, నాదేశ్వరరెడ్డి, సరళమ్మ తదితరులు పాల్గొన్నారు.

•వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ జనరల్ సెక్రటరీ అనితారెడ్డి 37వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏపీఆర్ ఆర్మీ సభ్యులు ఇక్బాల్, నరసింహారెడ్డి, షాలినీరెడ్డి, రాజేశ్వరి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పిలుపునిచ్చారు. 12వ డివిజన్ పరిధిలోని వావిలేటిపాడు, ఎస్టీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలు అందించి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా, వేణుంబాక విజయసాయిరెడ్డిని నెల్లూరు ఎంపీగా గెలిపించాలని కోరారు. 12వ డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు వేణురెడ్డి, రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



20వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



34వ డివిజన్‌లో ప్రార్థనలు చేస్తున్న ఆదాల హిమబిందు



37వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఏపీఆర్ ఆర్మీ సభ్యులు

వైఎస్సార్‌సీపీలోనే ముస్లింలకు పెద్దపీట



విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీలోనే ముస్లింలకు ప్రాధాన్యం లభించిందని ముస్లిం మత పెద్దలు జమాతే ఏ ఉలేమా సాధిక్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మౌలానాసాహెబ్, జియాఉల్లత్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని రామ్మూర్తినగర్‌లోని ఆయన కార్యాలయంలో ముస్లింలు బుధవారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ తాము పార్లమెంట్‌లో సిటిజన్ షిప్ అమెండ్‌మెంట్ బిల్లుపై అన్ని మతాలను సమానంగా చూడాలని, ఇతర దేశాలలో హింసకు గురవుతున్న ముస్లిం మైనార్టీలకు సైతం భారత దేశంలో పౌరసత్వం కల్పించాలని తమ వాణి వినిపించామని తెలిపారు. ముస్లింలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం మతపెద్దలు మీడియాతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడుగురు ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ నుంచి అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఖలీల్‌కు అవకాశం కల్పించడం మైనార్టీలపై సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రేమను అద్దం పడుతోందన్నారు. తామంతా ఏకమై నెల్లూరు ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌తో పాటు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ముస్లింల సమస్యలపై విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేయగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కాగా తొలుత తనను కలిసిన ముస్లిం మతపెద్దలతో విజయసాయిరెడ్డి మాట్లాడారు. పార్టీ నెల్లూరు సిటి ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాల చేరిక

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని గొల్లకందుకూరుకు చెందిన 25 కుటుంబాల టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం టీడీపీకి చెందిన వీ వెంకటరమణారెడ్డి, ప్రభాకర్, రామచంద్రయ్య, సురేష్, తదితరులు తమ బృందంతో కలిసి నెల్లూరులో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీ సుధాకర్ రెడ్డి, రామిరెడ్డి సందీప్‌రెడ్డి, సర్పంచ్ పెంచలనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన గొల్లకందుకూరు గ్రామస్తులతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

కార్పొరేషన్ నిబంధనలను విధిగా పాటించాలి

నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ సూచించిన నిబంధనలను ట్రేడ్ లైసెన్సులు పొందిన వ్యాపార సంస్థలు, వాణిజ్య కార్యాలయాలు విధిగా పాటించాలని మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ సూచించారు. రమేష్‌రెడ్డినగర్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల, నారాయణ విద్యాసంస్థలు, రామలింగాపురంలోని తాటిబెల్లం కాఫీ హోటల్, రెడ్‌క్రాస్ సమీపంలోని నెల్లూరు ఆస్పత్రిలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి మరింత మెరుగైన చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. నెల్లూరు ఆస్పత్రిలో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి బయోమెడికల్, జనరల్ వేస్టేజ్‌లను విడివిడిగా డిస్పోజ్ చేయాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ సూచించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

గోవుల తరలింపునకు స్పెషల్‌డ్రైవ్

కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే గోవులను ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గోశాలకు తరలించి సంరక్షిస్తామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మినీబైపాస్‌రోడ్డు, వనంతోపు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న గోవులను కల్లూరుపల్లి గోశాలకు బుధవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రోడ్లపైకి గోవులను వదిలిపెడితే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఎవరైనా అడ్డుకునేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



నెల్లూరు ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

దుకాణాల వద్ద చెత్తబుట్టలు తప్పనిసరి

కార్పొరేషన్ పరిధిలోని అన్ని వ్యాపార, వాణిజ్య ప్రాంగణాలు, దుకాణాల వద్ద చెత్త బుట్టలు తప్పనిసరిగా ఉంచుకోవాలని, పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీగా జరిమానాలు విధిస్తామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరుబస్టాండ్, తదితర ప్రాంతాల్లో పూల విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల యజమానులు, ఫ్లవర్ మార్కెట్ అసోసియేషన్ నాయకులకు సూచనలు చేశారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే దుకాణాలను శాశ్వతంగా సీజ్ చేస్తామన్నారు.

నేడు న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ఎంవీఎస్ అజయ్‌కుమార్‌పై జరిగిన దాడి ఘటనకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను గురువారం బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసనగా కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వారు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

సుమధురం ఐశ్వర్య, సౌందర్య గాత్రం



నెల్లూరు(బృందావనం): భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలో జరుగుతున్న 59వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాల్లో 5వ రోజు బుధవారం రాత్రి బెంగళూరుకు చెందిన ప్రముఖ సంగీత కళాకారులు, ఎంఎస్ సుబ్బులక్ష్మి మనుమరాళ్లు ఐశ్వర్య, సౌందర్య తన సుమధుర గాత్రంతో సంగీతప్రియులను మైమరిపించారు. వీరి గాత్రానికి మాతూరు విశ్వజిత్(వయోలిన్), ఫణీంద్రభాస్కర్(మృదంగం) వాద్యసహకారం అందించారు. స్మరణోత్సవాల్లో భాగంగా ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రముఖ హరికథకులు నీళ్ల సరస్వతిభాగవతారిణి లవకుశ హరికథగానం, బుర్రా పద్మనాభశర్మ సుందరకాండ హరికథాగానం చేశారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7గంటల వరకు స్థానిక కళాకారులు గాత్ర, వీణ కచేరీలతో అలరించారు. కాగా స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

పక్కాగా పది మూల్యాంకనం

నెల్లూరు(దర్గామిట్ట): పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనాన్ని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. డీఈఓ రామారావు మూల్యాంకనం వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ నెల 1వ నుంచి మూల్యాంకనం ప్రారంభమైందన్నారు. సుమారు 1700 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ నెల 8వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ జరుగుతోందని, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజనం అందజేస్తామన్నారు. డిప్యూటీ డీఈఓలు రఘురాం, ప్రసన్నలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ఖాన్ ఉన్నారు.



10వ తరగతి మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

మద్యం, నగదు అక్రమంగా తరలించడం నేరం

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని సాలుచింతల సెంటర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్ బుధవారం పరిశీలించారు. అనంతరం నగరంలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మద్యం, నగదు, మారణాయుధాలను వాహనాల్లో అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని ప్రయాణికులకు తెలిపారు. మద్యం, నగదు అక్రమ రవాణా, ఓటర్లకు నగదు పంపిణీ వంటివి గుర్తిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్వో వెంట 3వ నగర పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ శివకృష్ణ బృందం పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు





రాజీనామా పత్రాలను చూపుతున్న 23,32వ డివిజన్ వలంటీర్లు

నెల్లూరు సిటీ: టీడీపీ నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఈసీకు ఫిర్యాదు చేయించి తమ సేవలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. బుధవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్‌కు చెందిన 30 మంది, 32వ డివిజన్‌కు చెందిన 43 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా లేఖలను సంబంధిత అధికారులకు పంపారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న తమ పట్ల టీడీపీ వ్యవహరిస్తున్న తీరు అమానుషమని వారు పేర్కొన్నారు.

పింఛన్ కోసం పాట్లు



వెంకటేశ్వరపురంలో బారులు తీరిన పింఛన్‌దారులు

వలంటీర్లపై టీడీపీ కక్ష సాధింపు ధోరణి కారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్లు అందుకునే వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడాల్సి వచ్చింది. అడుగు తీసి అడుగు వేయలేని వయోవృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం ఊత కర్రలు, చక్రాల సైకిళ్ల సాయంతో, కుటుంబ సభ్యుల ఆసరాతో సచివాలయాల వద్దకు చేరుకుని బారులు తీరారు. మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో పింఛన్‌దారులు టీడీపీకి శాపనార్థాలు పెడుతూ కనిపించారు.

–నెల్లూరు(వీఆర్సీసెంటర్),
సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



రామలింగాపురంలోని సచివాలయం వద్ద పింఛన్‌దారుల పడిగాపులు



హరినాథపురంలోని సచివాలయం వద్దకు పింఛన్ కోసం వస్తున్న వృద్ధులు

నెల్లూరు బిడ్డను ఆశీర్వదించండి

నెల్లూరు(బృందావనం): జగనన్న ఆశీర్వాదంతో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నెల్లూరు బిడ్డ వేణుంబాక విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని ఆయన సతీమణి సునంద విజయసాయిరెడ్డి కోరారు. నగరంలోని 8వ వార్డులోని మహాలక్ష్మమ్మ ఆలయంలో బుధవారం ఆమె పూజలు చేశారు. అనంతరం ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నవాబుపేట, కుమ్మరివీధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 8వ డివిజన్ కార్పొరేటర్ కామాక్షీదేవి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కార్పొరేటర్లు సాహిత్య, మస్తానమ్మ, మహిళ నేతలు మాధవి, హిమబిందు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న సునంద విజయసాయిరెడ్డి

ప్రత్యేక తరగతుల పేరుతో ఫీజుల దందా

నెల్లూరు(అర్బన్): ఇంటర్మీడియట్ బోర్డు జూనియర్ కళాశాలలకు మార్చి 29 నుంచి మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ కొన్ని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వేసవిలో ప్రత్యేక తరగతుల పేరుతో ఫీజుల దందా సాగిస్తున్నాయని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ ఆరోపించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయి వారం రోజులు కూడా పూర్తవక ముందే నారాయణ, శ్రీచైతన్య వంటి కళాశాలలు తరగతులు ప్రారంభించడం దారుణమన్నారు. మరో కళాశాల గతేడాది చెప్పిన పాఠాల వీడియోలతో ఆన్‌లైన్ తరగతుల పేరుతో ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. నారాయణలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి ప్రమోట్ చేయాలంటే 50 శాతం ఫీజులు చెల్లించాలని, అప్పుడే తరగతులు నిర్వహిస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.